క్లుప్తంగా

వరాహ, కూర్మ అవతారాల్లో జగన్నాథుడు



భామిని: బత్తిలిలో వరాహ అవతారంలో దర్శనమిస్తున్న జగన్నాథుడు



పాలకొండ: కూర్మావతారంలో జగన్నాథస్వామి

జగన్నాథ స్వామి రథయాత్రలో భాగంగా స్వామివారు వరాహ, కూర్మ అవతారాల్లో సోమవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాలకొండ, బత్తిలిలో గల ఆలయాలు భక్తులతో కిక్కిరిసి పోయాయి. మంగళవారం హీరా పంచమి సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని పాలకొండ ఆలయ ప్రధానార్చకుడు విశ్వనాథందాస్ తెలిపారు.

– పాలకొండ/భామిని

కిటకిటలాడిన ఏరియా ఆస్పత్రి



ఏరియా ఆస్పత్రిలో చేరిన ఇన్‌పేషెంట్లు

సీతంపేట: స్థానిక ఏరియా ఆస్పత్రికి సోమవారం రోగుల తాకిడి పెరిగింది. ఓపీకి 318 మంది రోగులు రాగా.. వీరిలో 90 మంది జ్వరాలతో బాధపడుతున్నట్లు గుర్తించారు. 46 మంది ఇన్‌పేషెంట్లుగా చేరారు. వీరందరికీ సక్రమంగా వైద్యసేవలు అందిస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు తెలిపారు.

కొర్రలు, సామలు సాగుపై దృష్టి ..



గిరిజనులకు కొర్రలు, సామలు విత్తనాలు అందజేస్తున్న ఏపీఎం రాము

వీరఘట్టం: అంతరించిపోతున్న కొర్రలు, సామలు సాగుపై గిరిజనులు దృష్టి సారించాలని వెలుగు ఏపీఎం కె.రాము సూచించారు. మండలంలోని ఎస్.గోపాలపురం గ్రామానికి చెందిన గిరిజనులకు కొర్రలు, సామల విత్తనాలను సోమవారం ఉచితంగా అందజేశారు. సాగు చేసేందుకు ప్రస్తుత వాతావరణం అనుకూలమని చెప్పారు. సాగు విధానంపై ఐఎఫ్‌సీ యాంకర్ పర్సన్ ఎస్.సోనియా గిరిజనులకు పలు సూచనలు చేశారు.

పని ఒత్తిడి తగ్గించాలని వినతి



ఎంపీడీఓ త్రివిక్రమరావుకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

గుమ్మలక్ష్మీపురం: పని ఒత్తిడి తగ్గించాలని, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలానికి చెందిన పంచాయతీ కార్యదర్శులు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ పి.త్రివిక్రమరావును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా పంచాయతీ కార్య దర్శులు మాట్లాడుతూ 243 జీఓ ప్రకారం కేటాయించిన 29 అంశాలతో పాటు ప్రభుత్వం అప్పగించిన వివిధ సర్వేలు, డీడీఓ బాధ్యతల ను ఎంతో ఒత్తిడితో నిర్వహిస్తున్నప్పటికీ.. ఉన్నతాధికారులు టెలీ, వీడియో కాన్ఫిరెన్స్‌ల్లో తమ మనోభావాలు దెబ్బతీసే విధంగా, అవమానకర పదజాలాలతో మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో ఇటువంటివి పునరావృతం కాకుండా చూడాలని కోరారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేయించేందుకు ఉదయం 6 గంటలకే విధులకు హాజరుకావాలని ఆదేశాలతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని, దీనికి పరిష్కారం చూపాలని, పారిశుద్ధ్య పనుల్లో భాగంగా రోజువారీ చెత్త సేకరణ విధుల నిర్వహణకు సంబంధించి ఐవీఆర్ కాల్స్ ఆధారంగా తమ పనితీరును బేరీజు వేయకుండా చూడాలన్నారు. జీఎస్‌డబ్ల్యూఎస్ సర్వే, తదితర సమస్యలను ఎంపీడీఓకు వివరించారు.

ఓవర్‌హెడ్ ట్యాంకు మంజూరుచేయండి

పార్వతీపురం టౌన్: మండలంలోని గోపాలపురం గ్రామినికి ఓవర్‌హెడ్ ట్యాంకు మంజూరు చేయాలని సర్పంచ్ పెంట స్రవంతి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆమె కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి అనంతరం కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు.

నట్టల నివారణతో జీవాల్లో ఎదుగుదల

- జీవాలకు ఈనెల 10వ తేదీ వరకు నట్టల నివారణ మందు పంపిణీ
- గొర్రెలు, మేకల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలి
- జీవాల పోషణలో జాగ్రత్తలు తప్పనిసరి: పశువైద్యాధికారి పి.లక్ష్మణరావు



కళిగొట్టులో జీవాలకు నట్టల నివారణ మందు వేస్తున్న పశువైద్యాధికారి లక్ష్మణరావు

గుమ్మలక్ష్మీపురం: నట్టల నివారణ మందుతో మేకలు, గొర్రెల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, ఆరోగ్య సమస్యలు తలెత్తవని మండల పశువైద్యాధికారి పి.లక్ష్మణరావు చెప్పారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జూన్ 26వ తేదీ గొర్రెలు, మేకలకు ఉచితంగా నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించామని, జూలై 10వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని, జీవాల పెంపకందారులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని సూచించారు.

నట్టల నివారణ మందుతో బహుళ ప్రయోజనాలు

వర్షా కాలంలో జీవాల సంరక్షణలో కొన్ని జాగ్రత్త చర్యలు తప్పనిసరిగా పాటించాలని పశువైద్యాధికారి చెబుతున్నారు. నట్టల నివారణ మందును జీవాలకు తాపించడం ద్వారా బహుళ ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు. గొర్రెలు, మేకలను మేత కోసం దూర ప్రాంతాలకు తీసుకెళ్తుంటారని దీని వల్ల అవి ఎక్కువ శక్తిని కోల్పోయి నీరసించి వ్యాధుల బారిన పడతాయన్నారు. భూమికి దగ్గరగా ఉండే గడ్డిని తినడం వల్ల అంతర పరాన్న జీవులు గొర్రెలు, మేకల కడుపులోకి ప్రవేశించి పేగు



మేతకు వెళుతున్న మేకలు

లు, కాలేయం, ఊపిరితిత్తుల్లో పెరిగి పెద్దవిగా మారి గుడ్లు పెట్టి సంతతిని పెంచుతాయి. జలగలు, బద్దె పురుగులు, గుండ్రటి పురుగులు మొదలైన అంతర పరాన్నజీవులు వీటి శరీరంలో చేరి అనర్థాలు కలిగిస్తాయన్నారు. దీని వల్ల పారుడు, దవడ కింద నీరు దిగడం, రక్తహీనత, మలబద్ధకం, నీరసంగా ఉండడం వంటి లక్షణాలతో బాధపడుతూ, వ్యాధులకు గురై మరణిస్తుంటాయి. అంతర పరాన్నజీవుల నిర్మూలనకు నట్టల నివారణ మందులు తాగించడం ద్వారా జీవాల్లో వ్యాధి నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా, ధృడంగా, చురుకుగా ఉంటాయి.జీవాలకు నట్టల నివారణ మందు తాగించిన తర్వాత అవి ఎక్కువ మేతను తీసుకుంటాయి. బరువు త్వరగా పెరగడంతో పాటు ఆడజీవాలు త్వరగా ఎదకు వచ్చి పొర్లడం ద్వారా ఈతకు ఈతకు మధ్య కాలం తగ్గుతుంది. పాలు, మాంసం, ఉన్ని దిగుబడి, మందలో చూలికట్టే శాతం పెరుగుతుంది. ఏడాదికి నాలుగు దఫాలుగా ఈ మందు తాపించాలని, పశువైద్యశాలల్లో ఈమందు నిత్యం అందుబాటులో ఉంటుందని, పెంపకందారులు గమనించాలని పశువైద్యాధికారి లక్ష్మణరావు సూచిస్తున్నారు.

రోడ్డుపై కూరుకుపోయిన లారీ



నిలిచిపోయిన లారీలు

- వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం

కొమరాడ: పార్వతీపురం నుంచి రాయగడ వెళ్లే అంతర్రాష్ట్ర రహదారిపై చోళ్లపథం సమపంలో ఓ లారీ కూరుకుపోయింది. దీంతో రెండు వైపులా వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. అంతర్రాష్ట్ర రహదారి మొత్తం గోతులతో నిండిపోవడంతో రాకపోకలకు వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి చెరువును తలపిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు.



చెరువును తలపిస్తున్న అంతర్రాష్ట్ర రహదారి

ప్రజలకు అందుబాటులో ఉండాలి

వీరఘట్టం: వీఆర్‌ఏలు ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ ఏఎస్ కామేశ్వరరావు అన్నారు. మండలానికి చెందిన పలువురు వీఆర్‌ఏలు కొత్తగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ కామేశ్వరరావు

జీసీసీ సేల్స్‌మన్ మృతి

సీతంపేట: గొయిది జీసీసీ డీఆర్‌డిపో సేల్స్‌మన్ కొండగొర్రి లక్ష్మణరావు సోమవారం శ్రీకాకుళం రిమ్స్‌లో మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన్ను కుటుంబ సభ్యులు రిమ్స్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతి చెందడంపై పలువురు సంతాపం వ్యక్తం చేశారు. మృతుడికి భార్య సరస్వతి, కుమారుడు, ముగ్గురు కుమార్తెలున్నారు.

పొర్జా పైడి కుల పెద్ద..



మోహన్‌దాసు (ఫైల్)

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): ఏజెన్సీ ప్రాంతానికి చెందిన పొర్జా పైడి కులపెద్ద పత్తిక మోహన్‌దాసు (76) అనారోగ్యంతో బాధపడుతూ విశాఖపట్నంలోని కేజీహెచ్‌లో మృతి చెందారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

ఆదమరిస్తే అంతే..

- ప్రమాదకరంగా కె.వీరఘట్టం – వెంకటాపురం రహదారి



అధ్వానంగా తయారైన రహదారి



రోడ్డు పక్కనే ఉన్న లోయ

సీతంపేట: మండలంలోని కె.వీరఘట్టం నుంచి పాలకొండ మండలం డి.వెంకటాపురం కలుపుతూ వయా బర్న మీదుగా ఐదేళ్ల కిందట నిర్మించిన బీటీ రహదారి ప్రమాదకరంగా తయారైంది. రోడ్డు సైడ్ వాల్స్ పూర్తిగా కొట్టుకుపోయాయి. రోడ్డుపైన తారు ఎక్కిపోవడంతో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. రహదారికి మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. ఏ మాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా ప్రమాదం తప్పదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రవేశాలు పెంచాలి

గరుగుబిల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచేందుకు కార్యాచరణ చేపట్టాలని మండల విద్యాశాఖాధికారి-1 సామల సింహచలం సిబ్బందికి సూచించారు. సోమవారం స్థానిక ఎంఆర్‌సీలో విద్యార్థుల ప్రవేశాలకు సంబంధించి సీఆర్‌ఎంటీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోడల్ ప్రైమరి పాఠశాలల్లో విద్యార్థుల చేరికలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా ఒకటి, ఆరు తరగతులలో శత శాతం ప్రవేశాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సీఆర్‌ఎంటీలు క్షేత్రస్థాయిలో



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ-1 సింహాచలం

పాఠశాలలను సందర్శించి విద్యార్థుల హాజరు, స్టూడెంట్ కిట్ల పంపిణీ, పాఠశాల స్థితిగతులపై నివేదిక సమర్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ – 2 కె.కొండలరావు, సీఆర్‌పీఎంటీలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత పురుగు మందులు విక్రయించరాదు



ఎరువుల డీలర్లతో మాట్లాడుతున్న ఏఓ సౌజన్య

వీరఘట్టం: నిషేధిత పురుగు మందులు విక్రయించరాదని మండల వ్యవసాయశాఖ అధికారి జె.సౌజన్య సూచించారు. సోమవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఎరువుల షాపుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్టాకు వివరాలను బోర్డుపై నమోదు చేయాలన్నారు. ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. అలాగే కొనుగోలుదారులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని స్పష్టం చేశారు.

సమస్యలు పరిష్కరించాలి

పార్వతీపురంటౌన్: ఆర్‌టీసీలో అద్దె బస్సు డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రెడ్డి వేణు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద నిరస తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం డిపోలో సుమారు 33 అద్దె బస్సులలో 70 మంది డ్రైవర్లు పనిచేస్తున్నారన్నారు. వారికి టెండర్లో పేర్కొన్న విధంగా లేబర్ చట్టాలు, వేతనాలు అమలు కావడం లేదని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు లేవని, అద్దె బస్సుల డ్రైవర్ల సమస్య పరిష్కారం చేసి లేబర్ చట్టాలు, వేతనాలు ఈఎస్ఐ, పీఎఫ్, జీతాల సమస్య పరిష్కారం చేయాలని విజ్ఞప్తి చేశారు.



రాకపోలకు వీళ్లేకుండా మారిన సాకి రోడ్డు

రాళ్లు తేలిన రహదారి

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): కురుపాం మండలం వబ్బంగి పంచాయతీ కాకిలి నుంచి సాకి వెళ్లే బీటీ రోడ్డు రాళ్లు తేలి అధ్వానంగా తయారైంది. దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సుమారు ఆరు కిలోమీటర్ల మేర రోడ్డు మొత్తం రాళ్లు తేలిందని.. అధికారులు, పాలకులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు.

ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలి



ఆలయ క్యాలెండర్లను సర్పంచ్ మురళీకృష్ణ, తదితరులకు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

గరుగుబిల్లి: తోటపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలని టీటీడీ ఆలయ అభివృ ద్ధి ట్రస్టు కమిటీ సభ్యులు కోరారు. కొమరాడ మండలంలోని కళ్లికోట గ్రామంలో భక్తుల నుంచి సోమవారం విరాళాలు సేకరించారు. గ్రామంలోని పలువురు భక్తులు రూ.30వేలు విరాళం అందజేశారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర చిన్న తిరుపతిగా పేరుగాంచిన తోటపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా పునర్నిర్మాణం చేపట్టేందుకు దాతలు ముందుకు రావాలన్నారు. గ్రామస్తులకు ఆలయ క్యాలెండర్‌లను అందజేశారు. సర్పంచ్ దత్తి మురళీకృష్ణ, ట్రస్టు సభ్యులు ఎం.వాసునాయుడు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సారా బట్టీల ధ్వంసం

భామిని: మండలంలోని జియ్యమానుగూడ – బిచ్చుమానుగూడ సరిహద్దు ప్రాంతంలో గల సారా బట్టీలను సోమవారం కూడా ధ్వంసం చేశారు. రెండు రోజులుగా బత్తిలి ఎస్సై ఎ.అప్పారావు సిబ్బందితో కలిసి సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీలు చేపడుతున్నారు. సారా బట్టీలను ధ్వంసం చేయడంతో పాటు సారా తయారీకి ఉపయోగించే సామగ్రిని సీజ్ చేసి, బెల్లం ఊటలను పారబోస్తున్నారు. దాడుల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సాగు భూమికి పట్టాలివ్వండి



సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న గిరిజనులు

వీరఘట్టం: ఇరవై సంవత్సరాలుగా మండలంలోని చినగోర రెవెన్యూ పరిధిలో లక్ష్మీదేవి కొండ పక్కన.. రాళ్ల గెడ్డ పక్కన సుమారు 25 ఎకరాల భూమిని సాగు చేస్తున్నామని జియ్యమ్మవలస మండలం ఏనుగులగూడ, గడసింగుపురం గ్రామాలకు చెందిన గిరిజనులు తెలిపారు. అయితే తమ సాగులో ఉన్న భూమికి సంబంధించి డీ పట్టాలు ఇవ్వాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో వీరఘట్టం మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ.. వీరఘట్టం మండలం సంత – నర్సిపురం గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు తమ అధీనంలో ఉన్న భూములు వారివని చెబుతూ దౌర్జన్యం చేస్తున్నారన్నారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.సీతారాంతో కలసి తహసీల్దార్ ఏఎస్ కామేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు.

చేసిన సేవలే గుర్తింపునిస్తాయి ..

- ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి



సింహాచలంను సన్మానిస్తున్న పీఓ యశ్వంత్ కుమార్ రెడ్డి, తదితరులు

సీతంపేట: చేసిన సేవలే గుర్తింపునిస్తాయని ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక వైటీసీలో ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ డీఈ ఎస్.సింహాచలం, టెక్నికల్ వర్క్ఇన్‌స్పెక్టర్ కేవీ రమేష్‌ల ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. పదవీ విరమణ వరకు క్షణం తీరిక లేకుండా పనిచేసిన ఘనత డీఈ సింహాచలంనకు దక్కుతుందన్నారు. అనంతరం వారిని సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఏపీఓ జి.చిన్నబాబు, ఇంజినీరింగ్ ఈఈ కేవీఎస్ఎన్ కుమార్, డీఈలు కృష్ణకుమార్, సిమ్మన్న, ఏఈ నాగభూషణరావు, ట్రైబల్ వేల్ఫేర్ డీడీ అన్నదొర, తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో జమ చేయాలి



మాట్లాడుతున్న ఏపీఎం రాము

వీరఘట్టం: డ్వాక్రా సంఘ సభ్యులు తీసుకున్న స్త్రీనిధి రుణాలను రికవరీ చేస్తున్న గ్రామ సంఘాల సహాయకులు ఆ డబ్బులను బ్యాంకుల్లో సకాలంలో జమచేయాలని ఏపీఎం కె.రాము సూచించారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలోని 1755 గ్రామ సంఘాలకు చెందిన 1969 మంది డ్వాక్రా మహిళలకు రూ.27.39 కోట్ల స్త్రీనిధి రుణాలు ఇచ్చినట్లు చెప్పారు. ఇందులో ఇంకా రూ.5.40 కోట్ల రుణాలు రికవరీ చేయాల్సి ఉందన్నారు. అలాగే ఈ ఏడాది రూ.8 కోట్ల స్త్రీ నిధి రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. డ్వాక్రా సంఘ సభ్యులకు 4 శాతం వడ్డీకి ఎడ్యుకేషన్ లోన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. రుణాలు కావాల్సిన వారు గ్రామ సంఘాల్లో తీర్మానాలు చేసి ఇవ్వాలన్నారు.

కూటమి ప్రభుత్వంలో ప్రజలపై భారం

- సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దావాల రమణారావు



ధర్నా చేస్తున్న సీపీఎం, గిరిజన సంఘ నాయకులు

పాలకొండ: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ప్రజలపై అన్నిరకాలుగా భారం పడిందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దావాల రమణారావు ఆరోపించారు. ఈ మేరకు ప్రభుత్వం తీరును నిరసిస్తూ సోమవారం స్థానిక విద్యుత్ శాఖా కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి పాలన తలకిందులుగా ఉందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ ఇవ్వాల్సింది పోయి వేలల్లో బిల్లులు ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. మండలంలోని సింగన్నవలస పంచాయతీ పరిధిలోని మల్లమ్మగూడ గిరిజనులకు ఒక్కరికీ రూ.18 వేల చొప్పున బిల్లులు వచ్చాయని తెలిపారు. బిల్లులు చెల్లించక పోతే కనెక్షన్ కట్ చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారని, ఇది ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. అనంతరం విద్యుత్ శాఖ ఏఈకి వినతిపత్రం అందజేశారు.

ఒక్క అర్జీ రాలేదు..



ఖాళీగా ఉన్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక

వీరఘట్టం: ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలనే ఉద్దేశంతో సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక వెలవెలబోయింది. మండల పరిషత్ కార్యాలయం ఏఓ డి.వెంకటరావు, ఉపాధి ఏపీఓ జి.సత్యంనాయుడు మాత్రమే హాజరయ్యారు. మధ్యాహ్నం 12 గంటల వరకు ఒక్క వినతి గాని, మరే ఇతర శాఖల అధికారులు రాక పోవడం గమనార్హం.